క్లుప్తంగా

లారీ డ్రైవరుపై కేసు నమోదు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గుంటూరు– కర్నూలు జాతీయ రహదారి మార్గంలో ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లేళ్ల లోకేశ్వరరావు శనివారం తెలిపారు. ప్రధాన కూడలిలో రోడ్డు వెంబడి ఐదు దుకాణాలు ధ్వంసం అయిన ఘటనలో లక్ష్మి మొబైల్ షాపు యాజమాని నాగుబడి అశోక్‌కుమార్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవరు సయ్యద్ జాకీర్ హుస్సేన్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. స్థానికులు సహకారంతో పోలీసు అధికారుల పర్యవేక్షణలో మూడు క్రేన్లు ద్వారా దుకాణాల మధ్య లో ఇరుక్కు పోయిన లారీను మూడు గంటల శ్రమించి బయటకు తీసినట్లు చెప్పారు.

చోరీకి యత్నించి పట్టుబడిన ముగ్గురు మహిళలు



నాదెండ్ల: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి యత్నిస్తూ ముగ్గురు మహిళలు పట్టుబడిన ఘటన శనివారం మధ్యాహ్నం గణపవరంలో చోటు చేసుకుంది. గ్రామంలోని పశువుల ఆస్పత్రి వీధిలో తాళం వేసి ఉన్న ఇంటిలో ముగ్గురు మహిళలు చొరబడి తాళం పగులగొట్టారు. స్థానికులు వెంటపడి పోలేరమ్మగుడి సెంటర్‌లో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ముగ్గురు మహిళలు తాము గుంటూరు ఏటుకూరు రోడ్డులో నివాసం ఉండే వారమని, ప్లాస్టిక్ బాటిళ్లు, వ్యర్థాలను ఏరుకునేందుకు వచ్చామని బుకాయించారు. వారి వద్ద ఉన్న గోతాల్లో దొంగిలించిన కేబుల్ వైర్లు, విద్యుత్ వైరు కట్టలు దొరికాయి. గ్రామంలోని ఓ ఇంట్లో దొంగిలించినట్లు వారు ఒప్పుకున్నారు. పోలీసులు ముగ్గురు మహిళలను స్టేషన్‌కు తరలించారు.

3.0 ఎం.ఎం. వర్షపాతం

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో శనివారం సాయంత్రం విస్తృతంగా వర్షం కురిసింది. ఉదయానికి 3.0 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రి నుండే అడపా దడపా వర్షపు జల్లులు పడుతుండగా, శని వారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గ్రీష్మతాపంతో అల్లాడుతున్న మండల ప్రజలకు ఈ వర్షం ఉపశమనాన్ని ఇచ్చింది.

టీపీఓగా అనూరాధ బాధ్యతలు స్వీకరణ

నరసరావుపేట: పట్టణానికి రెండో టౌన్ ప్లానింగ్ అధికారి(టీపీఓ)గా అనూరాధ నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె శనివారం బాధ్యతలు స్వీకరించారు. పిడుగురాళ్లలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్)గా పనిచేస్తూ పదోన్నతిపై టీపీఓగా నరసరావుపేటకు వచ్చారు. గత ప్రభుత్వంలో ఆమె టీపీఎస్‌గా ఇదే పురపాలక సంఘంలో పనిచేశారు. మొదటి గ్రేడ్ పురపాలక సంఘమైన నరసరావుపేటకు ఇద్దరు టీపీఓలు ఉండాల్సి ఉండగా ఇప్పటివరకు టీపీఓగా సాంబయ్య ఒక్కరే పనిచేస్తున్న విషయం విదితమే. బాధ్యతలు స్వీకరించిన అనూరాధ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును మర్యాద పూర్వకంగా కలిశారు.

20వ రోజుకు చేరిన సీహెచ్‌ఓల సమ్మె



నరసరావుపేట: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌ఓ)లు చేస్తున్న సమ్మె శనివారంతో 20వ రోజుకు చేరింది. తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రతతో పాటు పలు డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని స్టేషన్‌రోడ్డు గాంధీ పార్కు వద్ద సీహెచ్‌ఓలు సమ్మె శిబిరం నిర్వహిస్తున్నారు. వీరికి ఏఐటీయూసీ జిల్లా నాయకులు కాసా రాంబాబు, ఉప్పలపాటి రంగయ్య, గాంధీ స్మారక సమితి అధ్యక్షులు ఈదర గోపీచంద్ సందర్శించి సంఘీభావం తెలియచేశారు. ప్రభుత్వం వెంటనే న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. జిల్లా అసోసియేషన్ నాయకులు అనుపమ, సాగర్, రాము, మస్తాన్, శివకోటి నాయకత్వం వహించారు.

ఘర్షణలకు దూరంగా ఉండండి

దొడ్లేరు(క్రోసూరు): నేరాల నియంత్రణకే పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని క్రోసూరు ఎస్‌ఐ పి.రవిబాబు అన్నారు. శుక్రవారం రాత్రి క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామస్తులతో పల్లె నిద్ర నిర్వహించి వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. చిన్నచిన్న విషయాలకు ఆవేశాలకు లోను కాకుండా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ముఖ్యంగా ఘర్షణలకు దూరంగా ఉండాలని సూచించారు. దాచేపల్లి చందు, మాజీ డీసీ చైర్మన్ దాచేపల్లి సైదా, మొఘల్ జాన్, మాజీ ఎంపీటీసీ చెత్తు బుడే, పూర్ణ చంద్రరావు, పోసిపోగు చిన్న వెంకయ్య, ప్రజలు పాల్గొన్నారు.

ప్రతిపక్షంలో మద్దతు.. నేడు ముఖం చాటింపు

- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తీరును నిరసించిన సీఐటీయూ నాయకులు
- 59వ రోజుకు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె



శిబిరంలో సమ్మె చేస్తున్న కార్మికులు, నాయకులు

నరసరావుపేట: ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో తమ పోరాటాలకు మద్దతు తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు నేడు ఆ వైపు వెళుతూ మొహం చాటేస్తున్నారని, సమస్య పరిష్కరించాలని అనేక మార్లు కలిసి విన్నవించినా పట్టించుకోలేదని ఏపీ మున్సిపల్ వర్కర్స్–ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ అన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కమిటీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 59వ రోజుకు చేరుకుంది. సిలార్ మసూద్ మాట్లాడుతూ భానుడు నిప్పులు కక్కుతూ రోడ్డు వెంట సెగలు వస్తున్నా, వర్షం కురుస్తున్నా, ఈదురు గాలులు వీస్తున్నా కార్మికులు ప్రదర్శిస్తున్న పోరాట పటిమను అభినందించారు. నెల మొత్తం పని చేసినా 10 నుంచి 15 రోజులకు మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నారని తాము ఆప్కాస్‌లో ఉన్నప్పటికీ సమానపనికి సమాన వేతనం రూ.21 వేలు ఎందుకివ్వరని ప్రశ్నించారు. పరిసరాల శుభ్రతకు పాటు పడుతున్న తమపట్ల అధికారుల నిర్లక్ష్య వైఖరి అవలంభించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమ దోపిడికి గురవుతున్న కార్మికులు కనీస వేతనాలు చెల్లించాలని అడగడం వారి ప్రాథమిక హక్కన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలన్నారు. కార్మికులు పాల్గొన్నారు.

బ్యాటరీ దొంగలు అరెస్ట్

రెండు గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు



పట్టుకున్న నిందితులతో పోలీసులు

చిలకలూరిపేటటౌన్: మండలంలోని బోప్పూడి గ్రామంలో బ్యాటరీ దొంగతనానికి పాల్పడిన ఇద్దరు దొంగలను చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేవలం రెండు గంటల్లో పట్టుకున్నారు. ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం బోప్పూడి గ్రామంలోని హెచ్.పి. పెట్రోల్ బంక్ వెనుక ఖాళీ స్థలంలో పార్క్ చేసిన టిప్పర్ లారీ నుంచి రెండు ఎక్సిడ్ బ్యాటరీలను అపహరణకు గురైనట్లు బాధితుడు మలిశెట్టి శ్రీనివాసరావు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ జి.అనిల్ కుమార్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, రామచంద్రాపురం గ్రామ సమీపంలోని జాతీయ రహదారి ఫ్లై ఓవర్ క్రింద ఒంగోలు పట్టణం మిలటరీ కాలనీకు చెందిన సయ్యద్ బాబు, చుండూరు మండలం నడిగడ్డపాలెంకు చెందిన షేక్ ఆసిఫ్‌బాషా నిందితుల్ని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.50 వేల విలువైన రెండు ఎక్సిడ్ బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన ఇద్దరినీ చిలకలూరిపేట ఏజేసీజే కోర్టులో హాజరుపరిచిన పోలీసులు, న్యాయమూర్తి ఆదేశాల మేరకు 15 రోజుల రిమాండ్‌కు తరలించారు. సయ్యద్ బాబుపై ఒంగోలు తాలుకా, చీమకుర్తి, టంగుటూరు పోలీస్ స్టేషన్లలో పలు దొంగతనాలు, గంజాయి కేసులు నమోదుకాగా, ఒంగోలు తాలూకాలో మరో అనుమానిత కేసు కూడా ఉందని పోలీసులు తెలిపారు.

స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో భాగస్వాములు కావాలి



నాదెండ్లలో నిర్వహించిన ర్యాలీలో అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



రొంపిచర్లలో చలివేంద్ర పరిసరాలను పరిశీలిస్తున్న ఎండీవో



పశువులకు నీరు అందజేస్తున్న అధికారులు



కరపత్రాలను ఆవిష్కరించిన వైద్యాధికారి



ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

శావల్యాపురం: స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలని మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు నుంచి రక్షణ పొందేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచి యాగసిరి చెన్నమ్మ, ఎంపీడీఓ పి. సీతారామయ్య, తహసీల్దార్ ఎం.అర్జున్‌నాయక్, ఏపీఎం జి.వాసుబాబు, ఏపీఓ రామారావు, ఆరోగ్య కార్యకర్త ఇంకోల్లు నాగలక్ష్మి పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

నూజెండ్ల: వడదెబ్బ తగలకుండా ఈ వేసవిలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయితీరాజ్ ఏఈ అల్లాభక్షు అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ కార్యక్రమం మండలంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ విధుల్లో ఉన్నప్పటికీ కార్యక్రమానికి హాజరు కాలేదు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

నాదెండ్ల: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి రోజూ ప్రతి ఒక్కరూ కొంత సమయం కేటాయించి శ్రమదానం ద్వారా స్వచ్ఛతకు కృషి చేయాలని తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. తొలుత పారిశుధ్య సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి మొగిలి నాగలక్ష్మి, ఈఓపీఆర్డీ నిర్మల లక్ష్మీకుమారి, కార్యదర్శి మక్కెన సుబ్బారావు ఉన్నారు.

రొంపిచర్లలో....

రొంపిచర్ల: మండలంలోని సొసైటీల్లో మూడవ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జిల్లా సహకార శాఖ అధికారి వెంకట రమణ ఆదేశాల మేరకు అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025ను పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పీఏసీ వై.మహేష్‌కుమార్, జీడీసీసీ బ్యాంక్ మేనేజర్ ఎం. కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్‌సీ డాక్టర్ రేవతీబాయి, వైద్య సిబ్బంది, బ్యాంకు సూపర్‌వైజర్ బి. వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు, సొసైటీ అధికారులు లక్ష్మీరెడ్డి, వీరారెడ్డి, లక్ష్మారెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో..

రొంపిచర్ల: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన రొంపిచర్ల చెరువు గట్టు సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్ర పరిసరాలను ఎండీవో మ్యాథ్యూబాబు పరిశీలించారు. పరిసర ప్రాంతాలన్నీ ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పంచాయతీ శానటరీ సిబ్బందిని ఆదేశించారు. అలాగే పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, పీఎస్ నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసరావుపేట రూరల్ పరిధిలో...

నరసరావుపేట రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఎంపీడీవో టివి కృష్ణకుమారి తెలిపారు. మండలంలోని అల్లూరి వారిపాలెంలో శనివారం స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ది హీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఎండ వేడిమి నుంచి తట్టుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను తెలియజేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధానరోడ్డులో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి పి.నాగనంత్, ఎస్‌బీఎమ్ ఎంఆర్‌సి టి.అయ్యప రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె.అశోక్, గ్రామ టీడీపీ నాయకుడు ఉడతా రాఘవ తదితరులు పాల్గొన్నారు.

కారుమంచిలో....

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో చేపట్టిన స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించినట్లు సొసైటీ సీఈవో వైవీ నారాయణ తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో భాగంగా రాయితీపై ఇస్తున్న సోలార్ పథకాన్ని రైతులు, గృహ యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీట్ ద హీట్ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం సొసైటీ భవనం పై భాగాన కూలింగ్ పెయింట్ వేశామని, దీనిద్వారా సూర్యకాంతిని ప్రతిభమించటం ద్వారా కార్యాలయంలో ఉష్ణోగ్రత తీవ్రత తగ్గుతుందన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్రలో భాగస్వాములు కావాలి

శావల్యాపురం: స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో మనందరి భవిష్యత్ కోసమని ఇందులో ప్రతి ఒక్కరు భాగస్వాములై స్వచ్ఛత దిశగా అడుగులు వేయాలని మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రతినెలా మూడవ శనివారం ఒక్కో నినాదంతో ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్రా లాంటి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు నుంచి రక్షణ పొందేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. చలివేంద్రాన్ని కూడా సందర్శించారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమం చేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాగసిరి చెన్న మ్మ, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు యం.అర్జున్‌నాయక్, ఏపీయం జి.వాసు బాబు, ఏపీవో రామారావు, పంచాయతీ కార్యదర్శి బోడ్డు యాకోబు, ఆరోగ్య కార్యకర్త ఇంకోల్లు నాగలక్ష్మి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



బొల్లాపల్లి: విద్యుత్ షాక్ గురై రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని సరికొండపాలెం తండాలో శనివారం జరిగింది. వివరాల ప్రకారం తండాకు చెందిన మేరా జోతు కృష్ణా నాయక్ (36) ఇంటి వద్ద ఉన్న లైన్‌కు విద్యుత్ సరఫరా లేకపోవడంతో శనివారం స్తంభం ఎక్కి కరెంటు సరిచేస్తుండగా విద్యుదాఘాతమై మృతి చెందాడు. సమీప పొలంలో మట్టి తోలకం వలన కరెంటు స్తంభానికి జేసీబీ తగలటంతో గత రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచింది. ఆ శాఖ అధికార సిబ్బంది పట్టించుకోకపోవడటంతో కరెంట్ లేదని స్వయంగా స్తంభం ఎక్కి తీగల సరిచేస్తుండగా ఒకసారిగా విద్యుదాఘాతమై కింద పడి మృతి చెందాడు. ప్రమాదంలో క్షతగాత్రుడిని వినుకొండలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య, ఐదుగురు సంతానం ఉన్నారు. ఈ మేరకు బండ్లమోటు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే



నరసరావుపేటటౌన్: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ హైమారావు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే జైలు శిక్ష తప్పదన్నారు.

కనువిప్పు కలిగించే కళారూపాలు



ఇది రహదారి కాదు నాటిక సన్నివేశం



చీకటి పువ్వు నాటిక సన్నివేశం

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: కళలే సమాజానికి చైతన్య దివిటీలై మార్గం చూపేవి కళలే అని చిలకలూరిపేట కళాపరిషత్ అధ్యక్షులు చెరుకూరి కాంతయ్య చెప్పారు. చిలకలూరిపేట కళాపరిషత్, సీఆర్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నాటికల పోటీలు శనివారం కొనసాగాయి. రెండోరోజు పోటీల్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలు మన సంప్రదాయాలకు ఆనవాళ్లని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పరిషత్ నిర్వహణకు ఎన్నో ఆటంకాలు ఏర్పడినా, కళల్ని బ్రతికించుకోవాలని, సమాజానికి అవి దోహదపడాలనే కాంక్షతో తిరిగి పరిషత్ నిర్వహణకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. అనంతరం స్వర్గీయ రాజ్‌కుమార్ కళావేదికపై ప్రదర్శనలు ప్రారం భమయ్యాయి. కార్యక్రమంలో రంగస్థలనటీ గుంటూరు లక్ష్మీ, దర్శకులు జరుగుల రామారావు, కొత్త శివ, గోరంట్ల నారాయణ, సీతయ్య, హరిబాబు, కేవీ మంగారావు, అంబటి బాలస్వామి, జమాల్‌బాషా, సుమా, ఇమామ్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు పరుగులకు జీవితం 'ఇది రహదారి కాదు' నాటిక

స్వేచ్ఛ అనే అమూల్యమైన వరాన్ని వ్యర్థంగా వాడుతున్న యువత మార్గ భ్రష్టమవుతున్నారని సందేశాత్మక కళారూపమే మిత్ర క్రియేషన్స్ హైదరాబాదు వారి 'ఇది రహదారి కాదు' నాటిక. పెళ్లి అనే పవిత్ర బంధాన్ని తృణీకరిస్తూ, సహజీవనాన్ని సాగిస్తూ.. పెళ్లి చేసుకున్నా ఇద్దరికీ సంపాదన ఉండాలి, కానీ పిల్లలు మాత్రం వద్దనే భావజాలం భారత సంస్కృతిమీద తీవ్రమైన దాడిగా మారి, భావితరాల నిర్మాణానికి భయంకరమైన అడ్డుగోడవుతుంది. అగ్రదేశాలు దేశాలు ఈ దారిలో నడిచి, యువత కొరత అనే అగాధంలో కూరుకుపోయిన దుస్థితిని ఈ నాటిక ఓ హెచ్చరిక. సమాజంలో అనేక తరగతులు, మనస్తత్వాల మధ్య మనం విలువలతో జీవించాలి, బాధ్యతతో ఎదగాలంటూ దేశానికి గ్రాండ్ మాస్టర్‌ను అందించిన ఓ తల్లికథ. ఈ నాటికను ఆకురాతి భాస్కరచంద్ర రచించగా, ఎస్ ఎం బాషా దర్శకత్వం వహించారు.

మానవత్వపు వెలుగులు గుబాళింపే 'చీకటి పువ్వు' తప్పితం మానవనైజమని, ఆ తప్పును తెలుసుకుని పశ్చాత్తాపపడే హృదయాలను మాటలతో మరింత శిక్షించడం మహాపాపమని కళాభారతీ కరీంనగర్ వారి కళారూపమే 'చీకటి పువ్వు' నాటిక. అవసరం, పరిస్థితుల ప్రభావం వల్ల చేసిన తప్పుకు మనిషిలో ఏదో ఒకనాడు మార్పు వస్తుంది. అప్పుడు ఆ వ్యక్తి ఎంతో పశ్చాత్తాపం చెందుతాడు. అలాంటి మనసుల్ని అర్థం చేసుకుని మనిషిగా చేరదీయాలి. కానీ వారిని మన నుండి దూరం చేసి మరింత శిక్షించకూడదని గొప్ప సందేశాన్ని ఇవ్వడంతో నాటిక ముగుస్తుంది. పరమాత్ముని శివరామ్ రచించిన ఈ నాటికకు రమేష్ మంచాల దర్శకత్వం వహించారు.

కాలువలకు మరమ్మతులు చేపట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట రూరల్: ఎన్ఎస్‌పీ కాలువల మరమ్మతులు వెంటనే చేపట్టాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని జొన్నలగడ్డ సమీపంలోని మైనర్ కాలువను శనివారం పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, ప్రసాద్, బీసీ సంఘ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుడికాలువ పరిధిలోని కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయని తెలిపారు. కాలువలు ముళ్లపొదలతో అడువులను తలపించేలా కనిపిస్తున్నాయని తెలిపారు. దీనివలన కాలువలకు నీటిని విడుదల చేసినా శివారు ప్రాంతాలకు నీరు అందే పరిస్థితి లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మే నెల ముగుస్తున్నా ఇప్పటి వరకు పలు కాలువల పనులు ప్రారంభించలేదని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మరమ్మత్తు పనులు అనుమతుల్లో ఆలస్యం అవుతుందని విమర్శించారు. రైతులు దీనిని గ్రహించి ప్రభుత్వ మోసాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సంప్రదాయేతర శక్తివనరులు పెంచుకోవాలి



మున్సిపల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట: సంప్రదాయేతర శక్తివనరుల వినియోగం పెంచుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సూచించారు. ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర బీట్ ది హీట్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా ఏర్పాటుచేసిన చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆ విధానం పదిమందికి తెలియచేసి పట్టణ పురోభివృద్ధికి తోడ్పాటు అందివ్వాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు మాట్లాడుతూ ప్రజలు అందరూ ప్లాస్టిక్ బహిష్కరించి పర్యావరణానికి హితమైన జ్యూట్ బ్యాగులు, గుడ్డసంచులు, టిఫిన్ బాక్స్‌లు వినియోగించాలని కోరారు. మెప్మా ఆర్‌పీలు, ఎస్‌హెచ్‌జీలు ప్లాస్టిక్ వినియోగించబోమని ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ ఇంజినీరు కనకారావు, డీఈ షేక్ రఫీ, టీపీఓలు సాంబయ్య, అనూరాధ, ఆర్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కారుమంచి సొసైటీలో వ్యాసరచన పోటీలు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) ఆధ్వర్యంలో బీట్ ద హీట్ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు శనివారం నిర్వహించారు. సొసైటీ సీఈఓ వైవీ నారాయణ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో భాగంగా రాయితీపై ఇస్తున్న సోలార్ పథకాన్ని రైతులు, గృహ యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

నరసరావుపేట టౌన్: హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ. సలోమి అన్నారు. శనివారం స్థానిక సబ్‌జైలును సందర్శించిన ఆమె ఖైదీలనుద్దేశించి మాట్లాడారు. ఉచిత న్యాయ సహాయం పొందే విధివిధానాలను వివరించారు. అందుతున్న సేవలను రిమాండ్ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ జైలర్ రవి యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాలు వితరణ



నిత్యవసరాలు పంపిణీ చేసిన కరణం విజయ్‌కుమార్

చిలకలూరిపేటటౌన్: శ్రీశిరిడీ సాయిబాబా మందిరం ఆలయ ట్రస్ట్ చైర్మన్ కరణం విజయకుమార్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న ప్రశాంతి వృద్ధాశ్రమంలో ఈ రోజు వృద్ధులకు కంది పప్పు, బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొని విజయకుమార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. మిత్రులు ఘనంగా సత్కరించి, ఆయన సేవా మనసును ప్రశంసించారు.

నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై తగిన చర్యలు

చిలకలూరిపేట: నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారు తగిన ఫలితం అనుభవించక తప్పదని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మున్సిపల్ కార్యాలయంలోని షరాఫ్ విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసిన గంగాభవాని రూ. 34.34 లక్షల నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలిపారు. ఇదే విషయాన్ని ఈ వ్యవహారం వెలుగు చూసిన తొలినాళ్లలోనే కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు ప్రస్తావించటం జరిగిందన్నారు. ఈ విషయమై నాడు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న చుక్కల గోవిందరావు నిధుల దుర్వినియోగం జరిగిందని, కొంత రికవరీ చేశామని, మిగిలిన ది రికవరీ చేస్తామని కౌన్సిల్ సాక్షిగా చెప్పారని వివరించారు. అయితే ఎంత మొత్తం దుర్వినియోగం జరిగిందో అప్పటికీ స్పష్టంగా తెలియదని, ఈ విషయంలో నాటి కమిషనర్ విచారణకు ఆదేశించినట్లు మాత్రమే తెలిపారని చెప్పారు. కౌన్సిల్ సమావేశంలోనే విచారించి తగు చర్యలు చేపట్టాలని అధికారులను కోరినట్లు వివరించారు.